క్లుప్తంగా

కాలుష్యాన్ని అరికట్టాలని వినతి



మహామాయ కర్మాగార ప్రతినిధికి వినతిపత్రం అందజేస్తున్న యువకులు

లక్కవరపుకోట: శ్రీరాంపురం గ్రామ సమీపంలోని స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్, మహామాయ కర్మాగారాల నుంచి వెలువడే కాలుష్యాన్ని అరికట్టాలని సంబంధిత కర్మాగార యాజమాన్యాలకు ఆగ్రామ యువత వడ్లమాని రామ్‌ప్రసాద్, వానపల్లి చెల్లయ్య ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. కర్మాగారాల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని, సీఎస్ఆర్‌లో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

క్రీడాపరికాల కోసం రూ.10వేల విరాళం



ఉపాధ్యాయుడు అందజేసిన క్రీడాపరికరాలతో విద్యార్థులు

లక్కవరపుకోట: గొల్జాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపరికరాలు సమకూర్చేందుకు ఆపాఠశాల గణిత ఉపాధ్యాయుడు గోవిందరావు రూ.10వేల విరాళం ఇచ్చారు. ఈనగదుతో పీడీ జగదీశ్వరరావు బ్యాడ్మింటన్ క్రీడా పరికరాలను కొనుగోలు చేసి విద్యార్థులకు గురువారం అందజేశారు. హెచ్ఎం సుదర్శనరావు ఉపాధ్యాయుడు గోవిందరావును అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



విద్యార్థి స్వాతిని అభినందిస్తున్న గాయత్రి కళాశాల కరస్పాండెంట్ శివప్రసాద్

చీపురుపల్లి: స్థానిక గాయత్రి కళాశాల విద్యార్థిని యెజ్జిపురపు స్వాతి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యిందని ఆ కళాశాల కరస్పాండెంట్ దాసరి శివప్రసాద్ గురువారం తెలిపారు. అండర్-19 విభాగంలో నవంబర్ 29న జిల్లా కేంద్రంలోని రాజీవ్ మైదానం లో రాష్ట్రస్థాయి పోటీలకు జరిగిన ఎంపికలో స్వాతి ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సాధించింది. అలాగే జిల్లా జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించనుంది. విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

దుప్పట్లు, స్పోర్ట్స్ పరికరాల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు, స్పోర్ట్స్ పరికరాలు పంపిణీ చేస్తున్న బెల్లాన శ్రీదేవి

చీపురుపల్లి: స్థానిక బీసీ సంక్షేమ సమీకృత బాలుర వసతిగృహంలో విద్యార్థులకు చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి దుప్పట్లు, స్పోర్ట్స్ పరికరాలు పంపిణీ చేశారు. ఆమె తనయుడు బెల్లాన వంశీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా బుధవారం రాత్రి వసతిగృహానికి వెళ్లి 100 మంది విద్యార్థులకు దుప్పట్లు, స్పోర్ట్స్ పరికరాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వసతిగృహాల్లో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. వసతి గృహ సంక్షేమాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం



బాధితులకు నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న కన్నంనాయుడు

బొండపల్లి: గొల్లుపాలెం గ్రామంలోని ఎరుకుల కాలనీలో బుధవారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి సర్వం కోల్పోయిన ఐదు బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతల కన్నంనాయుడు తనవంతు సహాయం చేశారు. ఒక్కొక్కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులతో పాటు రూ.1000 చొప్పున గురువారం అందచేశారు. స్థానిక సర్పంచ్ పోతల రమణమ్మ, రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్ గొల్లు సతీష్, మాజీ సర్పంచ్ పల్లి రామునాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం

- అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తున్నాం
- టీడీపీ చేసిన అభివృద్ధి ఏంటో ఆ పార్టీ నాయకులు చెప్పాలి
- 'గడప గడపకు మనప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పి.కె.పాలవలస గ్రామంలో గురువారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. అలాగే రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో అవినీతి రహిత సంక్షేమపాలన అందిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పి.కె.పాలవలస పంచాయతీ పరిధిలోని పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.22 కోట్లు అందించామని, ఇందులో ఎక్కడా ఒక్కరూపాయి కూడా అవినీతి జరగలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జనవరి 1 నుంచి సామాజిక పింఛన్ రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లోనే సేవలన్నీ అందిస్తున్నాం

సీఎం జగన్ నెలకొల్పిన గ్రామసచివాలయ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులను రైతులకు సకాలంలో అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు కూడా చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని, ప్రజలకు ఉన్న ఊరిలోనే వైద్యం అందేలా విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో ఏనాడైనా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు మళ్లీ అధికారం కోసం గ్రామాల్లోకి వచ్చి మాయమాటలు చెబుతారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని ఆ పార్టీ నాయకులకు సవాల్ విసిరారు. వారు చేసిందీ ఏమీ లేదని అన్నారు. టీడీపీ నాయకులు ఆ పార్టీలో ఉన్న వారికే మళ్లీ కండువాలు వేసి కొత్తగా తమ పార్టీలో చేరారంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ మధ్య ఆపార్టీ నాయకులు వారి స్థాయి మరచి మాట్లాడుతున్నారని, పెద్దలను విమర్శించినంతమాత్రాన వారిస్థాయిపెరిగిపోదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, స్థానిక ఎంపీటీసీ బైరెడ్డి సత్యవతి,నాయకులు నలిరెడ్డి లక్ష్మణ,రెల్లి శివ,రెల్లి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మండల నాయకులు బెల్లాన వంశీకృష్ణ,పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు ,పలు శాఖల అధికారులు,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్, నాయకులు

పార్టీ విజయానికి సమన్వయంతో పనిచేయాలి

- గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనరసయ్య



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపు మనదే అని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. లక్కిడాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి చేయనంత అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. ఒక్క లక్కిడాం గ్రామానికే రూ.30 కోట్లు నిధులు ఖర్చు చేశామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో విభేదాలు ఉంటే విడనాడి కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ కిలపర్తి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంధిరామునాయుడు,జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, నాయకులు నారాయణమూర్తిరాజు, నారాయణమూర్తి, జాగరపు సత్యారావు, లచ్చిరెడ్డి కృష్ణ, అప్పలనాయుడు, కొండలరావు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై అవగాహన



ప్రభుత్వం అందించే రాయితీలను వివరిస్తున్న సర్పంచ్ చాముండేశ్వరి

కొత్తవలస: ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం ఆధ్వర్యంలో ఉద్యానవనశాఖ సౌజన్యంతో పండ్ల తోటల పెంపకం, యాజమాన్య పద్ధతులపై సంతపాలెం గ్రామంలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. సర్పంచ్ బి. చాముండేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరాజు మామిడి తోటల్లో ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ, పూత, పిందె సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆధునిక పద్ధతిలో కూరగాయాల సాగువిధానంపై సహాయ అధ్యాపకుడు బి.వి.కె.ప్రసాద్ అవగాహన కల్పించారు. హెచ్ఓ పద్మ మాట్లాడుతూ రైతులకు ఉద్యానవన శాఖ రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందజేస్తోందని చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గోవిందరావు పాల్గొన్నారు.

కళాశాల సందర్శన

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీవీఈఓ(జిల్లా వృత్తివిద్య అధి కారి) భీమశంకర్ గురువారం సందర్శించారు. ముందుగా విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించి, వారికి పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించి, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో 60 మంది విద్యార్థులకు స్ఫూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన వెంట కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన



చిత్రలేఖనం ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: గరివిడి మండలంలోని కాపుశంభాం ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు అద్దాల కుమార్‌కు మాస్టర్ స్ట్రోక్ అవార్డు లభించింది. ఆయన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లిలో గురువారం అభినందించారు. ఇటీవల వెస్ట్ బెంగాల్‌కు చెందిన బీఎంఎఫ్‌సీఏ సంస్థ నిర్వహించిన వైల్డ్ యానిమల్స్ వాటర్ కలర్స్ పోటీల్లో ఈ ఉపాధ్యాయుడు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఆయనకు ఆ సంస్థ మాస్టర్ స్ట్రోక్ అవార్డు ఇచ్చింది.వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, ముజీకీర్ మహ్మద్, కోరుకొండ దాలయ్య పాల్గొన్నారు.

'హర్‌ఘర్ జల్'గా చినబంటుపల్లి



'హర్‌ఘర్ జల్' సర్టిఫికెట్‌ను విశ్వేశ్వరరావుకు అందజేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి పంచాయతీలో ఇంటింటికి తాగునీటి కుళాయిల ఏర్పాటు పూర్తవడంతో ఆ పంచాయతీని 'హర్‌ఘర్ జల్'గా ఎంపిక చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వై.గోవింద్‌రావు తెలిపారు. చినబంటుపల్లిలో గురువారం సభ ఏర్పాటు చేసి హర్‌ఘర్‌జల్ సర్టిఫికెట్‌ను మాజీ జెడ్పీటీసీ కోట్లవిశ్వేశ్వరరావుకు అందజేశారు.

సంక్షేమ సారథిని దీవించండి



చీపురుపల్లిరూరల్: పి.కె.పాలవలసలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. చీపురుపల్లి , గంట్యాడ, బొండపల్లి,జామి, దత్తిరాజే రు, వేపాడ,ఎల్.కోట,గజపతినగరం మండలాల్లోని పలుగ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరించి, గ్రామాలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురవేశారు. అనంతరం పల్లెనిద్ర చేశారు.

– చీపురుపల్లి రూరల్/గంట్యాడ/బొండపల్లి/జామి/దత్తిరాజేరు/వేపాడ/లక్కవరపుకోట /మెంటాడ(గజపతినగరం రూరల్)




జామి: ఎం.కె.వలసలో సంక్షేమపథకాల బోర్డు ఆవిష్కరణలో ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు,తదితరులు




చీపురుపల్లిరూరల్(గరివిడి): దేవాడలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ విశ్వేశ్వరరావు



బొండపల్లి: వెదురువాడలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు



వేపాడ: నీలకంఠరాజపురంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు,నాయకులు



గంట్యాడ: లక్కిడాంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



దత్తిరాజేరు: కె.కృష్ణాపురంలో పార్టీ జెండాను ఎగురువేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు



లక్కవరపుకోట: కల్లేపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



కొత్తవలస : రాజుపాత్రునిపాలెంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న జెడ్పీటీసీ శ్రీదేవి



మెంటాడ(గజపతినగరం రూరల్): మరుపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తవుడు

మహాకవి గురజాడకు ఘన నివాళి



చీపురుపల్లి: బాలుర ఉన్నత పాఠశాలలో గురజాడ రచనలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

చీపురుపల్లి: మహాకవి గురజాడ వెంకటప్పారావు ఆదర్శప్రాయుడని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ అన్నారు. జనవి జ్ఞానవేదిక ఆధ్వర్యంలో పాఠశాలలో గురజాడ వెంకటప్పారావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీనివాసరావు, జి.రమణమూర్తి, ఎం.నాగరాజు, పి. అప్పలనాయుడు, టి.దేవి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

కొత్తవలస: మహాకవి గురజాడ వెంకటప్పారావు వర్ధంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర, ఉద్యోగులు గురువారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ తమటపు రమేష్, రెవెన్యూ సిబ్బంది అప్పారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో...

గంట్యాడ: మదనాపురం మోడల్ స్కూల్‌లో గురజాడ వర్ధంతిని గురువారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, యువత

చీపురుపల్లిరూరల్(గరివిడి): రక్తదానం ప్రాణ పాయ స్థితిలో ఉన్న బాధితుల ప్రాణాలు నిలబెడుతుందని చీపురుపల్లి డీఎస్పీ ఏ.ఎస్. చక్రవర్తి అన్నారు. గరివిడికి చెందిన సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆసంస్థ సీనియర్ సభ్యుడు మండల పైడిరాజు జ్ఞాపకార్థం గరివిడి పట్టణంలోని విగ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావుతో పాటు 40 మంది రక్తదానం చేశారు. ఎస్ఎంఎస్ ఫెర్రోఎల్లాయిస్ డైరెక్టర్ వాకాడ గోపి, శ్రీరాం విద్యాపీఠ్ డైరెక్టర్ టి.కమలాకరరావు, బ్రహ్మకుమారి లతక్కయ్య, సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ బమ్మిడి కార్తీక్, బి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

- ఎస్సై చొరవతో తెరుచుకున్న కేంద్రం



తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

చీపురుపల్లి రూరల్(గరివిడి): అభంశుభం తెలియని చిన్నారులు చదువుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన సంఘటన గరివిడి మండలంలోని బొండపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగింది. ఎప్పటిలాగానే ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను తీసుకునే వెళ్లేసరికి కేంద్రానికి తాళం వేసి ఉండడంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు గరివిడి ఎస్సై ఎల్. దామోదరరావు కేంద్రానికి తాళం వేసిన టీడీపీ మాజీ సర్పంచ్‌తో ఫోన్‌లో మాట్లాడి, గ్రామంలోకి వెళ్లి కేంద్రానికి తాళం వేయడం మంచి విధానం కాదని చెప్పగా ఈ భవనాన్ని కాంట్రాక్ట్ చేశానని, బిల్లు చెల్లించకపోవడంతో తాళం వేయాల్సి వచ్చిందని మాజీ సర్పంచ్ బదులిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బిల్లు చెల్లించకపోతే అందుకు సంబంధించి ఒక విధానం ఉంటుందని, విధి విధానాల ప్రకారం ముందుకు వెళ్లాలే తప్ప కేంద్రానికి తాళం వేస్తే కేసు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రానికి వేసిన తాళాన్ని మాజీ సర్పంచ్ తెరవడంతో సమస్య సద్దుమణిగింది.

శారడ కర్మాగారంలో కార్మికుడు మృతి

కొత్తవలస: కంటకాపల్లి గ్రామ సమీపంలోని శారడ కర్మాగారంలో ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో క్యాజువల్ కార్మికుడుగా పనిచేస్తున్న డి.మహేష్‌బాబు(32) గురువారం మృతి చెందాడు. తోటికార్మికులు తెలిపిన వివరాలు... ఎస్.కోట మండలం తిమిడి గ్రామానికి చెందిన మహేష్‌బాబు కొన్ని సంవత్సరాలుగా శారడ కర్మాగారంలో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో టిఫిన్ తినే సమయంలో అస్వస్థకులోనై ఒక్కసారిగా పడిపోయాడు. దీంతో తోటి కార్మికులు కొత్తవలసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మహేష్‌బాబును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వీరజనార్దన్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

నేడు భూహక్కు పత్రాల పంపిణీ

బొండపల్లి: నియోజకవర్గంలోని బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం మండలాల పరిధిలో అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు శుక్రవారం శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేయనున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరం మార్కెట్ యార్డు ఆవరణలో మధ్యాహ్నం2 గంటలకు పట్టాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. మూడు మండలాల్లోని లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

గౌరమ్మ నిమజ్జనోత్సవం



గౌరమ్మ ఊరేగింపు

వేపాడ: మండల కేంద్రంలో గౌరమ్మ నిమజ్జనోత్సవం బుధవారం రాత్రి వైభవం గా నిర్వహించారు. ఆశ్వయుజమాస పౌర్ణమి పాడు వేపాడలో గౌరమ్మ(గౌరీప రమేశ్వర్లు)ను ప్రతిష్ఠించి కార్తీక పౌర్ణమి వరకు పూజలు చేశారు. వేపాడ, వల్లంపూడి జంట గ్రామాల్లో బుధవారం రాత్రి మొదలైన ఊరేగింపు గురువారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. నిమజ్జనోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వేపాడ,వల్లంపూడి,దబ్బిరాజుపేట, బక్కునాయుడుపేట, చిరతపాలెం, వీలుపర్తి, వెల్దాం తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

గజపతినగరం: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిహిందువూ ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ సాదుపరిషత్ అధ్యక్షుడు ఆనంద ఆశ్రమ పీఠాదిపతి శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మం ప్రపంచ దేశాల్లో కెల్లా గొప్పదని అన్నారు.అనంతరం ర్యాలీ చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ జాగారపు కృష్ణ, స్థానిక జ్ఞానానంద ఆశ్రమ పీఠాదిపతి యోగానంద భారతిస్వామి పాల్గొన్నారు.

పరుగు పందెంలో ద్వితీయ స్థానం

చీపురుపల్లి: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌లో స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న గంద్రేటి సత్యనారాయణ ద్వితీయ స్థానంలో నిలిచారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ సర్కిల్ పరిధిలోని ఉద్యోగులకు నవంబర్ 25, 26 తేదీల్లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెంలో సత్యనారాయణ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆయన్ని స్థానిక బ్యాంక్‌లో మేనేజర్, సిబ్బంది గురువారం అభినందించారు.